క్లుప్తంగా

15, 16 తేదీల్లో ఆటల పోటీలు



చిలకలపూడి(మచిలీపట్నం): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలై 15, 16 తేదీల్లో పురుషుల వాలీబాల్, మహిళల త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి దివాకర్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డి, ఆర్డీవో ఐ.కిషోర్, జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డుల మంజూరు

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లపరాజుగూడెం రైతు భరోసా కేంద్రం ఆధ్వర్యంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. సోమవారం ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీఏఏ టీఎస్.రాజు, వీఆర్‌ఓ ఎం. రమేష్ కౌలు గుర్తింపు కార్డుల వల్ల రైతులకు లభించే రాయితీలు, ఇన్సూరెన్స్, ఇతర లాభాలపై అవగాహన కలిగించారు. 20 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.వెంకట్రామయ్య, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

బంటుమిల్లి: ఉపాధి కూలీలకు బకాయి విడుదల చేయాలని, వంద రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు గత 40 రోజులుగా ఉపాధి కూలీలకు డబ్బులు పడటంలేదని వినతి పత్రంలో తెలిపారు. అర్హులైన కుటుంబ సభ్యులందరికీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి.నాగరాజు, ఎన్.కృష్ణ, నాయకులు ఎం.శ్రీనివాసరావు, అజయ్‌ఘోష్, రాంబాబు, జ్యోతి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

మచిలీపట్నంటౌన్: జిల్లాలో పనిచేస్తున్న 96 మంది సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నగర కమిషనర్ జి.చంద్రయ్య, ఉయ్యూరు, నూజివీడు, పెడన మునిసిపాల్టీల కమిషనర్లు ఈ సర్టిఫికెట్లు పరిశీలన చేశారు. జిల్లాలోని ఇతర మండలాలకు, ఇతర జిల్లాలకు బదిలీ కోసం అర్జీ పెట్టుకున్న వారు, ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చేందుకు అర్జీ పెట్టుకున్న వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్టిఫికెట్లను పరిశీలించారు.

ఆక్వా సర్వీసులకు ప్రత్యేక ఫీడర్ అవసరం



నాగాయలంక: మండల కేంద్రం (హెడ్‌క్వార్టర్ సబ్‌స్టేషన్)ఫీడర్‌పై ఏళ్ల తరబడి ఉన్న ఆక్వా సర్వీసులను వేరే ఫీడర్ కిందకు మార్చి నాగాయలంక టౌన్‌లో తరచూ ఇబ్బందులు కలిగిస్తున్న విద్యుత్ అంతరాయాన్ని నిరోధించాలని పలువురు విద్యుత్ వినియోగదారులు డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో సోమవారం అడ్వయిజరీ కమిటీ సమావేశం జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు అధ్యక్షతన జరిగిగింది. నాగాయలంక అంబేడ్కర్ నగర్ ఎస్సీ కాలనీలో గృహాలపైగా వెళ్లిన విద్యుత్ లైన్‌లను తొలగించాలని ప్రజలు విజ్ఞప్తిచేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని కమిటీ హామీ ఇచ్చింది. ఏపీసీపీడీసీఎల్ ఏఈ పి.ఏడుకొండలు, ఎంఏవో ఏపీ సంజీవకుమార్ పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు అందజేత

గూడూరు: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోటీ తత్వం పెరుగుతుందని మల్లవోలు జెడ్పీ హైస్కూలు పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పంచకర్ల నరసింహారావు అన్నారు. మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు నగదు పురస్కారాలను సోమవారం అందజేశారు. పాఠశాలలో మొదటి, ద్వితీయ, తృతియ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు అందజేశారు. పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ గోవాడ ప్రశాంతి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎస్.అరుణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూరిపాక కూలి వృద్ధురాలికి గాయాలు

గూడూరు: మల్లవోలు శివారు గరువు భద్రాచలం డొంకలో ఆదివారం రాత్రి వీచిన భారీ ఈదురు గాలులకు కత్తెరపాక కూలి వృద్ధురాలికి గాయాలయ్యాయి. పాకలో గ్రామానికి చెందిన పేరుమోను నాంచారమ్మ (65) తన కుమార్తె శివపార్వతి ఉంటున్నారు. ఆదివారం రాత్రి వీచిన గాలులకు వారు నివసిస్తున్న కత్తెర పాక కూలిపోయింది. ఆ సమయంలో పాకలో ఉన్న నాంచారమ్మకు గాయాలయ్యాయి.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య
- వరల్డ్ డ్రగ్ డే సందర్భంగా అవగాహన సదస్సులు
- మానవ హారాలు, ర్యాలీల నిర్వహణ



మచిలీపట్నం కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య



చల్లపల్లిలో ప్రసంగిస్తున్న డీఎస్పీ మురళీధర్

మచిలీపట్నంటౌన్: యువత మాదకద్రవ్యాలకు లోను కావద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. వరల్డ్ డ్రగ్ డే సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, పోలీస్‌శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నగరంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోనేరు సెంటర్‌లో అవగాహన సభను నిర్వహించారు. ఈ సభలో రామకృష్ణయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వయసు నుంచే మాదకద్రవ్యాల వాడకానికి అలవాటు పడుతున్నారని దీని వల్ల యువత వారి జీవితంలో ఎన్నో కోల్పోతున్నారన్నారు. సరదాగా మాదకద్రవ్యాలను తీసుకుంటూ దీనిని మానలేని పరిస్థితిలోకి యువత వెళుతోందన్నారు. విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకుని మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటే నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించి జీవితాన్ని ఉన్నతంగా కొనసాగించే వీలు కలుగుతుందన్నారు. బందరు ఏఎస్పీ వీరబాబు, డీఎస్పీ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మోపిదేవి: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్‌ఐ పద్మ సూచించారు. మోపిదేవి జెడ్పీపాఠశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల ఏర్పడే ఆరోగ్య సమస్యలు వివరించారు. మాదక ద్రవ్యాలు ఎక్కడైనా విక్రయించినా, సేవించినా వెంటనే పోలీసులకు తెలియపర్చాలని కోరారు. మాదకద్రవ్యాలు లేని సమసమాజ స్థాపనకు యువత ముందుకు రావాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం జయంతి, మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. సోమవారం అవనిగడ్డలో మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలపై కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఎస్‌ఐ రమేష్‌తో పాటు ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘంటసాలలో..

ఘంటసాలలో మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐటీఐ విద్యార్థులు పాల్గొన్న ఈ ర్యాలీలో మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలను ఎస్‌ఐ కె.శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రుమంలో పలువురు విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

బంటుమిల్లి: మాదకద్రవ్యాల నివారణపై పోలీసులు విద్యార్థులు, అధ్యాపకులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం (డ్రగ్స్ అబ్యూస్ డే) సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో (ఎస్‌ఈబీ) ఆధ్వర్యంలో బంటుమిల్లి పుర వీధుల్లో ర్యాలీ చేసి బస్టాండు సెంటర్లో మానవ హారం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్స్‌పాల్ డాక్టరు ఎస్.జగన్‌మోహన్‌రావు, సీఐ సతీష్‌కుమార్, ఎస్‌ఐలు ఏ.పైడిబాబు, గణేష్‌కుమార్ ప్రసంగించారు. డ్రగ్స్ వినియోగం వల్ల వచ్చే దుష్పరిణామాలను వివరించారు. డ్రగ్స్ కేసుల్లో ఇరుకున్న యువత జీవితం నాశనం అవుతుందని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజి, వాగ్దేవి జూనియర్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): నాగాయలంక పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక మారుతీ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్.ఐ ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు అసాంఘిక నేరాలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. గంజాయి, ఖైనీ, గుట్కాలు లాంటి మహమ్మారి విక్రయాలను విద్యార్థులు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు విద్యార్థుల నడవడికలను గమనించి జాగ్రత్త వహించాలని చెప్పారు. తల్లిదండ్రులు, పోలీస్‌సిబ్బంది, స్టాఫ్ పాల్గొన్నారు.

చల్లపల్లి: యువత, విద్యార్థులు మత్తు అలవాట్ల బారిన పడితే జీవితాలు నాశనం అవుతాయని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ అన్నారు. సోమవారం చల్లపల్లి సీఐ బీ.భీమేశ్వర రవికుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం నిర్వహించారు. విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సమావేశంలో డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దని సూచించారు. అనంతరం పోలీసులు, కళాశాల విద్యార్థులు కలిసి పురవీధుల్లో అవగాహన ప్రచార ర్యాలీ, ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమాన్ని చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి ఎస్‌ఐలు సీహెచ్.చినబాబు, కుడిపూడి శ్రీనివాసు, సీహెచ్.పద్మ, కరస్పాండెంట్ దుట్టా శివప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

నాబార్డు పనులను వేగవంతం చేయండి

కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో నాబార్డు ఆధ్వర్యంలో ఆర్‌ఐడీఎఫ్ కింద నిధులు మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన చాంబర్‌లో నాబార్డు నిధుల ద్వారా మంజూరైన పనులపై ఆయా శాఖల ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల వారీగా పెండింగ్ పనులు, ఇప్పటి వరకు ఖర్చైన నిధులపై ఆయన ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 శాఖలకు సంబంధించి 220 ప్రాజెక్టులు మంజూరయ్యాయన్నారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి పనుల నిమిత్తం ఈ నిధులు వచ్చాయని తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించి పూర్తయిన ప్రాజెక్టు వివరాలు ఎప్పటికప్పుడు అందించాలన్నారు.

ఇంకా ప్రారంభం కాని ప్రాజెక్టులను ప్రారంభించి తదుపరి సమావేశానికి పూర్తి సమాచారంతో అధికారులు రావాలన్నారు. నాబార్డు డీడీఎం మిళింద్ చౌలాస్కర్ మాట్లాడుతూ నాబార్డు ద్వారా మంజూరైన నిధులకు సంబంధించి ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయకపోతే ప్రాజెక్టు వ్యయం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితి రాకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, వివిధ శాఖలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ఖాజా



ఇంటింటి సర్వేలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ఖాజా తదితరులు



సూచనలిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

పెడన: అర్హులకు పథకాలు అందకపోయినా, పథకాలకు అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాలు పొందాలన్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ఎండీ ఖాజా అన్నారు. సోమవారం పట్టణంలోని 1, 2 సచివాలయాల పరిధిలోని ఒకటో వార్డు నుంచి ఆరు వార్డులలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఖాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాజా మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికీ సర్వేకు వచ్చిన సమయంలో పథకాలు వచ్చిందీ, రానిది అనే విషయాలపై ఆరా తీస్తారని, అర్హులై ఉండి కూడా రాకపోతే తాజాగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఈ జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కటకం ప్రసాద్, బాబూలాల్, పట్టణ కన్వీనర్ బండారు మల్లి, సమన్వయకర్త మతీన్, పార్టీ నాయకులు శ్రీను, వాసు, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సమన్వకర్తలు తదితరులున్నారు.

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

కోడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ పాండురంగారావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరులోపు ప్రతి ఇంటిని సందర్శించి జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న 11 ఉచిత సేవల గురించి వివరించాలని ఎంపీడీఓ సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వివరాలను డాక్యుమెంట్ రూపంలో సేకరించాలన్నారు జూలై 1వ తేదీ నుంచి ఈ బృహత్తర కార్యక్రమం మొదలవుతుందన్నారు. లబ్ధిదారులు తమ సమస్యలను తెలియజేయగానే జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పొందుపర్చాలని ఎంపీడీఓ ఆదేశించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు కూడా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఈఓపీఆర్డీ నాగరేవతి, కార్యదర్శులు పాల్గొన్నారు.

గూడూరు: జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ గూడూరు మండలం కోకనారాయణపాలెంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ డి.సుబ్బారావు ఆధ్వర్యంలో ర్యాలీలో ఈఓపీఆర్డీ పి.రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి టి.వి.భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మంగళవారం నుంచి కోకనారాయణపాలెంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 11 రకాల సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు.

కృత్తివెన్ను: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంపీపీ గరుడప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దీనిపై అధికారులతో ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. మొత్తం 11 రకాల సర్టిఫికెట్‌లను ఉచితంగా అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీనిపై అధికారులతో ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేసి గ్రామాలలోనే సర్టిఫికెట్లు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పిచ్చిబాబు, డీటీ శశికుమార్, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పెడన విద్యార్థులకు మంత్రి అభినందన



విద్యార్థులు మణికంఠ, వినయ్, టీచర్ లక్ష్మీదేవిలను అభినందిస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన పెడన విద్యార్థులు మణికంఠ, వినయ్‌కుమార్‌లతో పాటు టీచర్ లక్ష్మీదేవీలను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అభినందించారు. రీజనరేషన్ ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్–2023 అమెరికాలోని డల్లాస్ నగరంలో జరిగింది. ఈ ఫెయిర్‌లో ప్రదర్శనకు పెడన బీజేకేజెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రూపొందించిన 'స్మార్ట్ సొల్యూషన్ ఫర్ ఎకో పొల్యూషన్' ప్రాజెక్టు ఎంపికైంది. దీంతో మే 13 నుంచి 19 వరకు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వచ్చిన సందర్భంగా మంత్రిని సోమవారం బయోలాజికల్ ఉపాధ్యాయురాలు కె.లక్ష్మీదేవి, విద్యార్థులు కలిశారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన వివరాలను మంత్రికి లక్ష్మీదేవి వివరించారు. లక్ష్మీదేవి మాట్లాడుతూ నల్లమోహన దుర్గ మణికంఠ, వరద వినయ్ కుమార్‌ల విద్యార్థుల ప్రదర్శనకు గుర్తింపు వచ్చిందన్నారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ఖాజా, ఫ్లోర్ లీడర్ గంగయ్య, పట్టణ కన్వీనర్ మల్లి తదితరులున్నారు.

వంగవీటి రంగా జయంతి పోస్టర్ల ఆవిష్కరణ

వంగవీటి మోహన్‌రంగా 76వ జయంతి వేడుకల వాల్‌పోస్టర్లను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆవిష్కరించారు. జూలై నాలుగో తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఈ జయంతి వేడుకలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు సోమవారం పెడనలోని మంత్రి కార్యాలయంలో మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరింప చేసి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అల్లం పూర్ణచంద్రరావు, యర్రజర్ల మురళీశంకర్, పాదిలి చంటిబాబు, సలీం పర్వేస్‌లతో పాటు పెడన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు



తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం భాగ్యలక్ష్మి

పెడన: రాష్ట్ర ప్రభుత్వం విద్యావిధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందని, అందులో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా భాగస్వాములేనని బంగ్లా స్కూలు హెచ్‌ఎం భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం పాఠశాలలో పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో భాగంగా వంటలను సైతం రుచికరంగా ఉన్నదో లేదో పేరంట్స్ కమిటీ సభ్యులు పరిశీలించవచ్చన్నారు. విద్యార్థులకు అందించే జగనన్న విద్యాకానుక కిట్లు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన పిమ్మటే విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు ఎండీ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలి



నాగాయలంక: ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను బ్యాంకుల సమన్వయంతో ప్రజలకు అందించే కీలక బాధ్యత బుక్ కీపర్లదేనని పలువురు అధికారులు పేర్కొన్నారు. స్థానిక దివిసీమ మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ క్రాంతిపథం ఏపీఎం కె.వై.దాస్ అధ్యక్షతన ద్వాక్రా బుక్ కీపర్ల విస్తృత రివ్యూ సమావేశం నిర్వహించారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఎస్‌హెచ్‌జీకి రూ.20 లక్షల మేర రుణం అందిస్తున్నామని వివరించారు. రైతులకు సంబంధించిన ప్రతి గేదెకు తప్పనిసరిగా బీమా చేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక బుక్‌కీపర్‌లకు సూచించారు. ఇల్లు కట్టుకునేవారికి పొదుపు నుంచి రూ.35 వేలు రుణం ఇస్తామని హౌసింగ్ ఏఈ కార్తికేయ వివరించారు. ఎస్.ఐ ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహిళా చట్టాలు, దిశ గురించి వివరించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాల ఆచూకి ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ,పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో నగరంలోని పలు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించబడుతున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 32వ డివిజన్ దేశాయిపేటలో రూ.20 లక్షల గడప గడపకు నిధులు, రూ.3 లక్షలు మునిసిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న ఆరు సిమెంటు రోడ్ల పనులకు నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి పేర్ని కిట్టు శంకుస్థాపన చేశారు. కిట్టు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన డివిజన్లలో ప్రతి డివిజన్‌కు రూ.20 లక్షల నిధులను మంజూరు చేస్తున్నారన్నారు. ఈ నిధులతో ఆయా డివిజన్లలోని పలు కాలనీల్లో సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. ఈ నిధులతో దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే పేర్ని నాని నగరంలోని సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి నిధులు తీసుకురావటం అభినందనీయమన్నారు. డివిజన్ కార్పొరేటర్ చింతా వెంకటేశ్వరరావు, డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చింతా మౌనిక, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవితథామస్‌నోబుల్, కార్పొరేటర్లు ఐనం తాతారావు, మాచవరపు రాంప్రసాద్, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, పలు డివిజన్ల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పాల్గొన్నారు.

నిరుపేదలకు వాసవీ క్లబ్ చేయూత



రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

కోడూరు: నిరుపేద కుటుంబాలకు వాసవీ క్లబ్ దివిసీమ –కోడూరు ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. స్థానిక దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ఆదివారం రాత్రి క్లబ్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. క్లబ్ రాష్ట్ర ప్రతినిధులు మహంకాళి మురళీధర్, చారుబండ్ల రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుంటారని, ప్రతి సంవత్సరం అనేక మందికి వివిధ క్లబ్‌లు, సంఘాల ద్వారా సేవ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పది మంది మహిళలకు చీరలు, రైతులకు వ్యవసాయ పరికరాలు, నిరుపేదలకు నిత్యావసర సరుకుల కిట్లను అందించారు. క్లబ్ ప్రతినిధులు కొనగళ్ల జగదీష్‌బాబు, బూరగడ్డ హరినాథ్‌బాబు, మద్దాళి ప్రసాద్, చిట్టూరి శ్రీనివాస్, గాదె మోహనబాబు, సుదర్శన్, అన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐజేయూ నేత అంబటికి నివాళులు

అవనిగడ్డ: ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) నేత అంబటి ఆంజనేయులుకు దివి జర్నలిస్టులు నివాళులర్పించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి అప్పికట్ల శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, పలువురు సీనియర్ జర్నలిస్టులు అంబటి శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కోట సుబ్బారావు, కోట యూరీగగారిన్, అలపర్తి గోపాలకృష్ణ, గట్టిపాటి సుధీర్‌బాబు, జేవీఎస్ శాస్త్రి, సింహాద్రి జయరాం, ఎస్.మునీశ్వరరావు, దోవా గోవర్ధన్, బీడీఆర్, పరిశె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంఘ ప్రయోజనాలకోసం పనిచేశారు..

మితభాషి, మృదుస్వభావి ఐజేయూ నేత అంబటి ఆంజనేయులు మరణవార్త తనను నిశ్చేష్టుడిని చేసిందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వప్రయోజనాల కోసం కాకుండా ఎప్పుడూ జర్నలిస్టుల అభ్యున్నతి, సంఘ ప్రయోజనం కోసమే ఆలోచించేవారని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

3 నుంచి మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

మచిలీపట్నంటౌన్: యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో డాక్టర్ పట్టాభి మెమోరియల్ గ్రామీణాభివృద్ధి సంస్థలో జూలై 3 నుంచి ఆగష్టు 5వ తేదీ వరకు నెల రోజుల పాటు జర్దోసీ మగ్గం వర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయభారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే స్టేషన్ ఎదుట తమ సంస్థలో మహిళలకు ఉచిత వసతి, ఉచిత భోజన సదుపాయంతో నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, యూనియన్ బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు. కృష్ణాజిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.వివరాలకు6301905759,80089 96818 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

19 పాఠశాలల్లో స్కూలు కమిటీ సమావేశాలు

నాగాయలంక: మండలంలోని 51 పాఠశాలలు ఉండగా సోమవారం 19 పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి–2 అన్నపరెడ్డి రామారావు పర్యవేక్షణలో ఆయా పాఠశాలల హెచ్.ఎంలు, పీఎంసీ కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జగనన్న విద్యా కానుక, గోరుముద్ద లాంటి కార్యక్రమాలపై తల్లిదండ్రులతో చర్చించారు. మండలంలోని మిగతా పాఠశాలల్లో మంగళవారం సమావేశాలు జరుపుతామని, ప్రభుత్వం పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధిపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారని ఎంఈఓ చెప్పారు.

కొట్లాటలో యువకుడికి గాయాలు

కోనేరుసెంటర్: ఇరువురి యువకుల మధ్య ఏర్పడిన స్వల్ప వివాదం కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. మచిలీపట్నం మల్కాపట్నంకు చెందిన తిరుమలశెట్టి గుణవర్ధన్, శాండి అనే ఇద్దరు యువకులు రైలు పేటలోని పరిచయస్తుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లారు. భోజనాలు జరిగే సమయంలో ఇరువురి మధ్య వివాదం కొట్లాటకు దారి తీయడంతో ఆగ్రహంతో ఊగిపోయిన శాండీ పక్కనే ఉన్న పేడు తీసుకుని గోవర్ధన్ తలపై బలంగా కొట్టాడు. గోవర్ధన్‌ను చికిత్సకై సర్వజన ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలియజేయడంతో కుటుంబ సభ్యులు విజయవాడ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మచిలీపట్నం పోలీసులు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కోనేరుసెంటర్: నగరంలో జరుగుతున్న పేకాట శిబిరాలపై చిలకలపూడి పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. దాడిలో ఐదుగురు పేకాటరాయుళ్లను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.36,060 స్వాధీనం చేసుకున్నారు. న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో పేకాట జరుగుతున్నట్లు అందిన సమాచారంపై చిలకలపూడి ఎస్సై కిషోర్ ఇతర సిబ్బంది దాడి చేశారు. పట్టుబడిన పేకాటరాయుళ్లను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ కిషోర్ తెలిపారు.